క్లుప్తంగా

ఆహ్వానం



జనగామ: తెలంగాణ నూతన పీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌ను మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ గౌడ్ మంగళవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లికి రావాలని ఆయనను ఆహ్వానించారు. అంతకు ముందు మహేశ్‌కుమార్‌ను సత్కరించారు. కొమురవెల్లికి త్వరలోనే వచ్చి స్వామిని దర్శించుకుంటానని ఆయన చెప్పినట్లు వారు తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కొమ్మూరి



టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన తర్వాత జనగామ నియోజకవర్గ అభివృద్ధి, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, తదితర వాటిపై మాట్లాడారు. సంక్షేమ పథకాలు పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం మండల కమిటీ ఎన్నిక

నర్మెట: నాయీబ్రాహ్మణ మండల కమిటీ అధ్యక్షుడిగా నిమ్మకంటి అనిల్ ఎన్నికయ్యారు. సాయిబాబా మందిరం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్వేల్ రఘుపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తపల్లి వెంకటేష్, కోశాధికారి కొత్తపల్లి ప్రశాంత్, ఉపాధ్యక్షుడు దుంపలపల్లి ఆనంద్‌లు హాజరై ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా అరిగెల విజయ్, కోశాధికారి నిమ్మకంటి గణేశ్, ఉపాధ్యక్షుడిగా కొలెపాక భాస్కర్, సహాయ కార్యదర్శిగా నిమ్మకంటి సంపత్, గౌరవ అధ్యక్షుడిగా నిమ్మకంటి బుగులయ్య ఎన్నికయ్యారు. అనంతరం జిల్లా నాయకులను శాలువాలతో సత్కరించారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి



సుందర్‌నాథ్(ఫైల్)

జనగామ: జనగామ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ గండి సుందర్‌నాథ్(58) మంగళవారం మృతి చెందాడు. హనుమకొండకు చెందిన సుందర్‌నాథ్ 1987లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని సూర్యాపేట రోడ్డులోని ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్న ఆయన అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూశాడు. విషయం తెలుసుకున్న డీసీపీ వెంకన్న, ఏసీపీ పార్థసారథి, సీఐ దామోదర్‌రెడ్డి అక్కడకు వెళ్లి నివాళులర్పించారు. సుందర్‌నాథ్ మృతి తమను కలచి వేసిందన్నారు. కాగా, ఎస్సై భరత్, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు నివాళులర్పించారు. మృతుడి కుమారుడు సాగర్ సీఆర్‌పీఎఫ్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

జనగామ రూరల్: చికిత్సపొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని 60 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి నాగుల కుంట ప్రాంతంలో పడిపోయి ఉండగా స్థానికుడు ప్రశాంత్ ఈనెల 3వ తేదీన జనగామ ఏరియా ఆస్పత్రిలో అడ్మిట్ చేశాడు. అనంతరం ఆ వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. కాగా, మృతుడు వరంగల్ శివనగర్‌కు చెందిన భాస్కర్ తండ్రి పేరు చంద్రమౌళి అని తెలిసిందని పోలీసులు తెలిపారు. సంబంధీకులు జనగామ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని అన్నారు.

మత్తడి కాల్వపై లోలెవల్ రోడ్డు నిర్మిస్తాం

చిల్పూరు: మత్తడి కాల్వపై లోలెవల్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు రూ. 25 లక్షల వ్యయం కానుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభిస్తామని పీఆర్ డీఈ రాజగోపాల్ అన్నారు. మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన రైతులు మంగళవారం ఉదయం చిల్పూరు ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిశారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని ఊరకుంట మత్తడి నుంచి ముసుర్లకుంటకు నీరు వెళ్లే కాలువకు మధ్యలో వేసిన పైపులు ఇటీవల వర్షాలకు కొట్టుకుపోవడంతో వంద మంది రైతులకు చెందిన పొలాలకు వెళ్లే దారిలేకుండా పోయిందని రైతుల పక్షాన శ్రీధర్‌రావు.. శ్రీహరికి వివరించారు. వెంటనే స్పందించిన ఆయన పీఆర్ అధికారులను ఆదేశించడంతో రైతులతో కలిసి పరిశీలించారు. ఈకాల్వపై పైపులు వేస్తే మళ్లీ కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నందున శాశ్వతంగా లోలెవల్ రోడ్డు వేయాలని అందుకు కొలతలు తీసుకున్నారు.

జనగామ రూరల్: సీపీఎం కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పట్టణ కార్యదర్శి ప్రకాశ్ తదితరులు



నర్మెట: చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు



ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ దోపిడీకి వ్యతిరేకంగా, భూమి కోసం, భుక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన వీరోచిత పోరాటం మరువలేనిదన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, రజక సంఘం, ఐద్వా, పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జనగామ: చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రజకసంఘం నాయకులు



పాలకుర్తిటౌన్: నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు



జనగామ: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో..



కొడకండ్ల: నివాళులర్పించిన నాయకులు



బచ్చన్నపేటలో..



రఘునాథపల్లిలో..



పాలకుర్తి టౌన్: తహసీల్‌లో.. తహసీల్దార్ శ్రీనివాస్



చిల్పూరులో..



దేవరుప్పల: కడవెండిలో సీఐటీయూ నాయకులు

జనగామ: న్యాయవాది ఆలేటి సిద్ధిరాములు ఆధ్వర్యంలో..





జనగామరూరల్: చౌరస్తాలో కేజీకేఎస్ ఆధ్వర్యంలో..



జఫర్‌గఢ్: తమ్మడపల్లి (జి)లో నివాళులర్పిస్తున్న ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానా తదితరులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో..



స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండలో..

కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



పాలకుర్తి టౌన్: కాంగ్రెస్ ప్రజాపాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆమె అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, పాలకుర్తి, కొడకండ్ల కాంగ్రెస్ మండల అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, దారవత్ సురేష్‌నాయక్, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత

ఎల్లమ్మగడ్డతండాను గ్రామ పంచాయతీగా ప్రకటించాలని తండా వాసులు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి కోరారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. బానోత్ రమేష్‌నాయక్, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని నిరసన



జనగామ రూరల్: ఇటీవల భారీ వర్షాలకు జనగామ నుంచి నర్మెటకు వెళ్లే గానుగుపహాడ్ క్రాస్ వద్ద ధ్వంసమైన రోడ్డుకు అధికారులు మరమ్మతు పనులు చేపట్టి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని గానుగుపహాడ్ గ్రామస్తులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శానబోయిన మహిపాల్ మాట్లాడుతూ నర్మెట, తరిగొప్పుల, హుస్నాబాద్‌తో పాటు అనేక గ్రామాలకు ఇదే మార్గం గుండా ప్రయాణించాల్సి ఉన్నందున వెంటనే పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పాలకుర్తి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధీర్ ప్రజలకు సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దతండా(బి) గ్రామపంచాయతీ శివారులో దుబ్బతండాలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో విషజ్వరాలు, డెంగీ రాకుండా వ్యక్తిగత పరిశుభ్రతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు, కార్యక్రమంలో మండల వైద్యాధికారి సిద్ధార్థ, అనిల్, సిబ్బంది శంకరమ్మ, వేణు, విజయ, శోభ పాల్గొన్నారు.



పాలకుర్తి: వైద్యశిబిరం నిర్వహిస్తున్న డాక్టర్లు

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

రఘునాథపల్లి: వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి కమలహాసన్ అన్నారు. మంగళవారం మండలంలోని మాదారంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 111 మంది రాగా వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 16 మందికి జ్వరం సోకినట్లు తేలింది. వారికి వెంటనే డెంగీ, మలేరియా పరీక్షలు చేయగా నెగిటివ్ రావడంతో జ్వరానికి సంబంధించిన మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామ్‌కిషన్, ఎంఎల్‌హెచ్‌ఓ లావణ్య, హెల్త్ అసిస్టెంట్లు విష్ణువర్ధన్‌రెడ్డి, పండారి, ఏఎన్‌ఎంలు స్టెల్లా మేరి, అన్నపూర్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఏసీపీ పార్థసారథి

నర్మెట: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జనగామ ఏసీపీ పార్థసారథి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్‌లో పాల్గొన్న ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. యువత గంజాయి, గుట్కా, మాదక ద్రవ్యాల క్రయ విక్రయాలు, వినియోగానికి దూరంగా ఉండాలని తెలిపారు. అపరిచిత వ్యక్తుల నుంచి వాహనాలను కొనుగోలు చేయరాదని, ధ్రువపత్రాలను పరిశీలించి కొనుగోలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రూ. 6,400 మద్యం, 6,800 గుట్కాలు, 21 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో సీఐ మినుకూరి సాయిరమణ, ఎస్సైలు నైనాల నగేష్, కంకాల సతీష్, అయ్యల స్వేత, నరేష్, మోదగు భరత్, ఎం. స్వేత, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

జనగామ రూరల్: పోషకాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ ఏసీడీపీఓ వి. సత్యవతి అన్నారు. మంగళవారం పోషణ మాసంలో భాగంగా పట్టణంలోని సంజయ్‌నగర్ కాలనీ , బెగ్గర్స్ కాలనీ, ధర్మకంచ 1,2 అంగన్‌వాడీ సెంటర్‌లో అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు కథలు చెప్పి చదివించారు. సూపర్‌వైజర్ పూర్ణిమ టీచర్ రేణుక, జయ, భారతి, జ్యోత్స్న, విజయ, నర్సమ్మ, వరలక్ష్మి, పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

రఘునాథపల్లి: బాలింతలు, గర్భిణులు, పిల్లలు రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి అన్నారు. మంగళవారం రఘునాథపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారులతో ప్రీస్కూల్ కథల పుస్తకాల ద్వారా సీక్వెన్స్ కార్డ్స్‌తో పిల్లలతో మాట్లాడిపించి కథను రాబట్టి చెప్పించారు. అంగన్‌వాడీ టీచర్ అరుణ, విఓఏ షరీఫా, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

తరిగొప్పులలో..

తరిగొప్పుల: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని పీఓ అధ్యక్షురాలు రుక్కమ్మ అన్నారు. మండలంలోని భోజ్యతండ, రూప్లా తండాల అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం సందర్భంగా అక్షరభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బుజ్జి, స్వరూప ఆయా స్వరూప, ఆశ వర్కర్ హంస, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే పిల్లల అభ్యున్నతి

దేవరుప్పుల: పుట్టిన ప్రతి శిశువుకు పోషకాహారం పెట్టినప్పుడే భవిష్యత్‌లో సంపూర్ణ ఆరోగ్యంతో అభ్యున్నతి పొందుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి సూచించారు. మండలంలోని ధర్మగడ్డతండాలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారం, కిశోర బాలికలు, గర్భిణుల జాగ్రత్తలు, పుట్టిన శిశువుకు ముర్రిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురి చిన్నారులకు అన్నప్రాసనం చేసి అక్షరభ్యాసం చేయించారు. మాజీ సర్పంచ్ సునీత, హెచ్‌ఎం వరప్రసాద్, టీచర్లు శ్రీలత, శౌరీల, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

న్యాస్ మాక్ టెస్ట్ పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్: జాతీయ స్థాయిలో నిర్వహించనున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(ఎన్‌ఏఎస్)–2024కు సంబంధించిన మాక్‌టెస్టును స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో న్యాస్ మాక్ టెస్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్‌లో నిర్వహించే న్యాస్ పరీక్షల్లో జనగామ జిల్లా మొదటిస్థానంలో ఉండేలా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఎన్‌ఓ కొమురయ్య, హెచ్‌ఎంలు సంపత్, సదామోహన్, ఎమ్మార్సీ సిబ్బంది గిరి, జ్యోతి, రమేశ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: అధికారులు తమ విధుల్లో చిత్తశుద్ధితో, బాధ్యతగా పనిచేయాలని, నిర్లక్ష్యంగా పనిచేస్తే చర్యలు తప్పవని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పంచాయతీరాజ్ అధికారులతో మంగళవారం ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా వివిధ మండలాల ఏఈలతో మాట్లాడుతూ చేసిన, చేపట్టాల్సిన రోడ్ల పనులపై సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడేది లేదని, పనుల్లో నాణ్యత ఉండాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్‌ఈ రఘువీరారెడ్డి, ఈఈలు శ్రీనివాసరావు, శంకరయ్య, డీఈలు రవీందర్, శిరీష, శ్రీనివాసరావు, డీపీఓ స్వరూపరాణి, ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న, ఎంపీడీఓ విజయశ్రీతో పాటు డిప్యూటీ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యం

జఫర్‌గఢ్: విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని రఘునాథ్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువుపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. చదువుతో పాటు విద్యార్థులు తెలివితేటలు, మంచి గుణాలను అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కట్టా మనోజ్‌రెడ్డి, రడపాక సుదర్శన్, సొసైటీ చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, ఎల్లయ్య, ఎడ్ల వెంకటస్వామి, పెద్దిరెడ్డి, ఐలయ్య, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు కృషి

లింగాలఘణపురం: వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రజక సంఘం మండల అధ్యక్షుడు దీకొండ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వేల సంవత్సరాల క్రితమే సమ్మక్క–సారలమ్మలు పోరాడిన గడ్డ అని, తెలంగాణ మట్టి అంటేనే పోరుగడ్డ అని అన్నారు. భూస్వాములకు ఎదురొడ్డి పోరాడిన ఐలమ్మ చరిత్రను తక్కువ చేశారని, చాకలి ఐలమ్మ స్ఫూర్తితో తెలంగాణ సాధించుకున్నామన్నారు. ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయకుండా ఎవరెవరివో ఉన్నాయని, ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. అంతేకాకుండా రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడం రాష్ట్రపతి చేతిలో ఉంటుందని, అందుకు తనవంతు సహకారం చేస్తానన్నారు. వెనుకబడిన రజకులు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో రజక సంఘం భవనాలను మంజూరీ చేశానని, పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా మండల కేంద్రంలోని భవనానికి అదనంగా మరో రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బోయిని లక్ష్మి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు.రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపిరజక, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శివకుమార్, పోరెడ్డి మల్లారెడ్డి, ప్రవీణ్, వీరయ్య, నాయకులు పాల్గొన్నారు.

గణనాథులకు ప్రత్యేక పూజలు

స్టేషన్‌ఘన్‌పూర్: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జంటపట్టణాలైన స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి గ్రామాల్లో వినాయక మండపాల్లో గణనాథులకు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. స్థానిక శ్రీరామకాలనీలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నాల్గో రోజు ప్రత్యేక పూజలు చేపట్టారు. శ్రీవరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తా సమీపాన నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఘన్‌పూర్ సీఐ జి.వేణు ప్రత్యేక పూజలు చేపట్టారు. అదేవిధంగా శివునిపల్లి బరోడాబ్యాంకు వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న మండపం వద్ద చేపట్టిన అన్నదానం కార్యక్రమాన్ని తహసీల్దార్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఉత్సవ కమిటీల బాధ్యులు బంగ్లా శ్రీను, ఇల్లందుల రాజు, పులి రమేష్, గట్టు రమేష్, గడ్డం కృష్ణమూర్తి, విష్ణు, వంశీ, తరుణ్, గన్ను కార్తీక్, వంగ రోహిత్, రంజిత్ పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్ పూజలో సీఐ, భక్తులు

మల్కాపూర్‌లో..

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఆర్‌జీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో అర్చకుడు చొల్లేటి రాజేశ్వరశర్మ వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.



జఫర్‌గఢ్ పూజలో ఆర్యవైశ్య మహిళలు

గణపయ్యకు 108 రకాల నైవేద్యం

జఫర్‌గఢ్: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యకు 108 రకాల నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గండె సోమన్న ఆధ్వర్యంలో ఈ పూజ కార్యక్రమాలు చేపట్టారు.

నివాళి

బచ్చన్నపేట: మండలంలోని ఇటుకాలపల్లి గ్రామానికి చెందిన కామల్ల బీరప్ప మృతి చెందాడు. కాగా, 1984–85 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ తోటి మిత్రులు గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధితుడి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పూర్వ విద్యార్థులు యాదగిరి, మురళి, సత్యనారాయణ,సుధాకర్‌రెడ్డి, రాములు, యాదయ్య, రాజమౌళి ఉన్నారు.

రాఘవరావుకు..

చిల్పూరు: తొలి పార్లమెంటేరియన్, స్వాతంత్ర్య సమరయోధుడు పెండ్యాల రాఘవరావు వర్ధంతి సందర్భంగా మంగళవారం గ్రామస్తులు ఆయన విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన రాఘవరావు తొలిసారిగా పార్లమెంట్‌లో అడుగు పెట్టాడు. ఆయన వర్ధంతి సందర్భంగా పలువురు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మామిడాల లింగారెడ్డి, గజ్జెల దామోధర్, తాళ్లపల్లి సమ్మయ్య, జనగాం యాదగిరి, బొందయ్య, రాజ్కుమార్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

బచ్చన్నపేట: అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని మండలంలోని ఆలింపూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ మసూద్ అన్నారు. గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆర్‌వీఎం ఆస్పత్రి గజ్వేల్ వారి ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పెద్దపాటి కరుణాకర్, నిర్వాహకుడు గణేష్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుమారుడిని మానసిక ఆస్పత్రిలో చేర్పించేందుకు సహకరించండి

చిల్పూరు: తమ కుమారుడికి హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో చేర్పించేందుకు సహకరించాలని మంగళవారం మండలంలోని నష్కల్ గ్రామానికి చెందిన వడ్లకొండ యాదగిరి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన యాదగిరి కల్లు గీస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని చిన్న కుమారుడు తిరుపతి (36) రేండేళ్లుగా మానసిక స్థితి సరిగా లేకపోవడంతో హనుమకొండలో పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. మానసిక వ్యాధి తీవ్రం కావడంతో రోడ్డు వెంట పోయే వారిని కొట్టడం లాంటివి చేస్తున్నాడు. దీంతో ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేర్పించేందకు సహకరించాలని తిరుపతి తండ్రి ఫిర్యాదు మేరకు పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సహకరిస్తామని ఎస్సై తెలిపారు.

పట్టుదలతో చదవాలి

బచ్చన్నపేట: విద్యార్థులు పట్టుదలతో చదవాలని మండల నోడల్ అధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు డిక్షనరీలను ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పదో తరగతిలో విద్యార్థులు 10 జీపీఏ సాధించడానికి ఇప్పటి నుంచే ప్రణాళిక వేసుకొని చదవాలని అన్నారు. ఉపాధ్యాయులు పృథ్వీరాజ్, వెంకట్‌రెడ్డి, రామచంద్రం, బాలరాజు, పద్మజ, నర్సింహ్మారెడి పాల్గొన్నారు.